నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, సోమవారం 22 ఏప్రిల్ 2024 | KARIMNAGAR

గీత కార్మికులను ఆదుకోవాలి

- కాలిన చెట్లను సంరక్షించే మార్గాలను అన్వేషించాలి
- కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్
- తాడూరులో దగ్ధమైన తాటి వనం పరిశీలన

తాడూరులో కాలిపోయిన తాటి చెట్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 21: తంగళ్లపల్లి మండలం తాడూరులో ప్రమాదవశాత్తు తాటి వనం దగ్ధమై ఉపాధి కోల్పోయిన గీతకార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన తాడూరులో కాలిపోయిన తాటిచెట్లను పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే హార్టికల్చర్ యూనివర్సిటీ వీసీ నీరజతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యను వివరించారు. కాలిన చెట్లను సంరక్షించే మార్గాలను అన్వేషించాలని కోరారు. కాలిన చెట్లు వానకాలంలో చిగురించకుంటే.. తాను బీహార్‌లోని పాట్నా నుంచి పొట్టి తాటి విత్తనాలను తెప్పించి పార్లమెంట్ పరిధిలోని గీత కార్మికులకు పంపిణీ చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పుడు నర్సరీల్లో పొట్టి తాటి మొక్కలు దొరికితే కాలిన తాటిచెట్ల ప్రదేశంలో నాటిస్తానని తెలిపారు. గీత కార్మికులకు తక్షణ సాయం అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతిని ఫోన్ ద్వారా కోరారు. కాగా, తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పలువురు గీతకార్మికులు వినోద్‌కు వినతిపత్రం అందించారు. ఆయన వెంట జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ పడిగెల మానస, పీఏసీఎస్ చైర్మన్ బండి దేవదాస్‌గౌడ్, వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, నాయకులు మాట్ల మధు, పడిగెల రాజు, సురభి నవీన్‌రావు, ములిగే దుర్గాప్రసాద్, బాల్‌రెడ్డి, కందుకూరి రామాగౌడ్ ఉన్నారు.

ఉన్నత చదువులకు వెళ్లి..

- అమెరికా రోడ్డు ప్రమాదంలో హుజూరాబాద్ యువకుడి దుర్మరణం
- వైద్యుల కుటుంబంలో విషాదం

ముక్క నివేష్ ఫైల్

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్ 21 : ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. అమెరికాలోని అరిజోనా రాష్ట్రం ఫినిక్స్ ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హుజూరాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ ముక్క కృష్ణమూర్తి మనువడు ముక్క నివేష్ (20) మృతి చెందాడు. మృతుడు డాక్టర్ కృష్ణమూర్తి కొడుకు డాక్టర్ నవీన్, స్వాతి దంపతులకు నివేష్, సందేష్ ఇద్దరు కొడుకులు. చిన్న కొడుకు తల్లిదండ్రులతో ఉండి హనుమకొండలోని తేజస్విని పాఠశాలలో ఇటీవలే పదో తరగతి పూర్తి చేశాడు. పెద్ద కొడుకు ముక్క నివేష్ గత సంవత్సరం జనవరిలో ఇంజినీరింగ్ కంప్యూటర్ సైన్స్ చేయడానికి అమెరికా అరిజోనా రాష్ట్రంలోని అరిజోనా స్టేట్ యూనివర్సిటీలో జాయిన్ అయ్యాడు. ప్రస్తుతం నివేష్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. శనివారం ఉదయం నివేష్‌తో పాటు కళాశాలకు చెందిన మరో ముగ్గురు స్నేహితులు కలిసి వాటర్ ఫాల్స్ చూసేందుకు వెళ్లారు. తిరిగి కారులో వస్తుండగా రాత్రి 11.30 గంటల(అమెరికా కాలమానం ప్రకారం)కు వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన కారు బలంగా వీరిని ఢీకొట్టింది. దీంతో వెనుక సీట్లో కూర్చొన్న ముక్క నివేష్‌తోపాటు తన సహచర విద్యార్థి హనుమకొండకు చెందిన గౌతమ్ సైతం మృతి చెందినట్లు నివేశ్ తల్లిదండ్రులు డాక్టర్ నవీన్, డాక్టర్ స్వాతి తెలిపారు. కాగా, ఈ ఘటనపై అరిజోనా పోలీసులు సమాచారం అందించడంతోపాటు అక్కడి పోలీసులు 00026879/2024 ద్వారా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఎం సుధీర్‌కుమార్ మక్క కృష్ణమూర్తి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దూర విద్యా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 21: దూర విద్యా కేంద్రాల ద్వారా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అందిస్తున్న సేవలను పేద, మధ్య తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యనభ్యసించాలని ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ సూచించారు. ఆదివారం ఎస్సారార్ కళాశాలలోని దూర విద్యా కేంద్రం ప్రాంతీయ సమన్వయ అధికారి డాక్టర్ ఆడెపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ, పీజీ విద్యార్థుల పరిచయ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రాంతీయసమన్వయ అధికారి డాక్టర్ శ్రీనివాస్, సీనియర్ కౌన్సిలర్స్ పరశురాము, రమేశ్, వసంత, రాము, సంతోష్‌కుమార్ సిబ్బంది వీరస్వామి, మహదేవ్ పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులు పూర్తి చేయాలి

జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

కలెక్టరేట్, ఏప్రిల్ 21 : జిల్లాలో ఓటరు నమోదు జాబితాలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సత్వరమే పూర్తి చేసి, నివేదికలు పంపాలని సంబంధితాధికారులను జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి ఆదేశించారు. ఆదివారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో జిల్లాలోని నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్ల రిటర్నింగ్ అధికారులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లాలోని ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు నిరంతరాయంగా విధులు నిర్వహించాలన్నారు. ఎనిమిది గంటలకో టీమ్ చొప్పున 24 గంటల పాటు పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలోని చెక్‌పోస్టులు పూర్తి స్థాయిలో పనిచేసేందుకు అవసరమైన సిబ్బంది ఉండాలన్నారు. జిల్లాలోని పరిస్థితులపై ఏఆర్‌వోలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అవసరమైన చర్యలకు నివేదికలందించాలన్నారు. సమావేశంలో కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, హుజూరాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ల ఆర్‌వోలు కే మహేశ్వర్, ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, రమేశ్‌బాబు పాల్గొన్నారు.

ఆగర్భ శ్రీమంతుడు.. భూగర్భ కార్మికుడికి పోటీ!

కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల ఆస్తుల వివరాలతో తేటతెల్లం

- సింగరేణి బిడ్డగా జనంలోనే కొప్పుల ఈశ్వర్
- ఆయన, ఆయన భార్య పేరిట ఉన్న ఆస్తుల విలువ ₹5.22 కోట్లు
- స్నేహలత పేరిట ₹1.74 కోట్ల అప్పులు
- ప్యారాచూట్‌లా దిగిన గడ్డం వంశీ.. తండ్రి, తాత కార్డు
- ఆయన, ఆయన భార్య పేరిట ₹22.61 కోట్ల స్థిర, చరాస్తులు
- హైదరాబాద్‌తోపాటు ఇతర రాష్ట్రాల్లో విలువైన భూములు
- ఇద్దరినీ పోల్చి చూస్తున్న నియోజకవర్గ ప్రజలు
- గుణవంతుడికి, ధనవంతుడికి పోటీ జరుగుతున్నదనే అభిప్రాయాలు
- అజాత శత్రువు కొప్పులకు.. అనుభవం లేని గడ్డం వంశీ తీరుతెన్నులను బేరీజు వేస్తున్న జనం

గడ్డం వంశీ @ ₹22.61 కోట్లు

కాంగ్రెస్ అభ్యర్థి వంశీకి ₹22.61 కోట్ల విలువైన స్థిర, చరాస్తులున్నట్లు నామినేషన్‌లో స్పష్టం చేశారు. ఆయన వద్ద ₹89.04 లక్షల బ్యాంకు డిపాజిట్లతోపాటు షేర్లు, బాండ్లు పేరిట ₹11.38 కోట్ల పెట్టుబడులు ఉన్నాయని తెలిపారు. భార్య రోషిణి పేరిట ₹4.23 లక్షల బ్యాంకు డిపాజిట్లతోపాటు ఎస్వీఏ రోషిణి ప్రైవేట్ లిమిటెడ్ పేరిట ₹80 వేల పెట్టుబడులు ఉన్నాయని చెప్పారు. ఎల్ఐసీ, ఇతరత్రా పాలసీల పేరిట వంశీకి ₹23.85 లక్షలు, రోషిణికి ₹10.50 లక్షలు ఉన్నాయి. ₹6.83 కోట్లు వంశీ వ్యక్తిగత రుణం తీసుకున్నారు. వంశీ పేరిట రంగారెడ్డి జిల్లా మొయినాబాద్, అజీజ్‌నగర్‌లో ₹1.73 కోట్ల విలువైన మొత్తం 4.18 ఎకరాల భూమి ఉన్నది. ఒడిశా రాష్ట్రంలోని సంభాల్పూర్ జిల్లాలో వేర్వేరు చోట్ల ₹6.94 కోట్ల విలువైన మొత్తం 10.09 ఎకరాల మేర భూములున్నాయి. ఇవే కాకుండా సికింద్రాబాద్‌లోని వెస్ట్ మారేడ్‌పల్లిలో ₹1.30 కోట్ల విలువైన 406 చదరపు అడుగుల స్థలం, తిరుమలగిరిలో ₹43.44 లక్షల విలువైన 162.7 చదరపు అడుగుల స్థలాలున్నాయి. మొత్తం వీటి విలువ ₹4.17 కోట్లు ఉన్నట్లుగా ప్రస్తావించారు. భార్య పేరిట ఎలాంటి స్థిరాస్తులు, భూములు లేవు. భార్య పేరిట ₹10.50 లక్షల బీమా పాలసీ ఉంది. వంశీ వద్ద 100 గ్రాముల బంగారం (విలువ ₹6.80 లక్షలు), రోషిణి వద్ద 500 గ్రాముల బంగారం (విలువ ₹34 లక్షలు) ఉన్నట్లు తెలిపారు. అతనిపై, భార్యపేరిట ఎలాంటి సివిల్, క్రిమినల్ కేసులు లేవని నామినేషన్‌లో స్పష్టం చేశారు.

ఆగర్భ శ్రీమంతుడు.. భూగర్భ కార్మికుడికి మధ్య పోటీ జరుగుతున్నదా..? ప్యారాచూట్ నేత.. జననేత మధ్యన పోరు సాగుతున్నదా..? అంటే పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజానీకం అవుననే అంటున్నది. బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్.. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ గుణగణాలను పోల్చి చూస్తున్నది. ఈ మట్టితోపాటు సింగరేణి కార్మికలోకంతో అనుబంధమున్న కొప్పులకు అండగా నిలిచేందుకు కదులుతున్నది. మరోవైపు ఎమ్మెల్యే వివేక్ కొడుకు వంశీకి పెద్ద పెద్ద వ్యాపారాలు తప్ప తమ కష్టాలు ఏం తెలుసని ప్రశ్నిస్తున్నది. ఈ పోటీ సమాజం కోసం పనిచేసే గుణవంతుడికి, ఆస్తులు కూడబెట్టుకునే ధనవంతుడికి మధ్య జరుగుతున్నదని స్పష్టం చేస్తున్నది. శుక్రవారం నామినేషన్ల సందర్భంగా వీరిద్దరు పేర్కొన్న ఆస్తుల వివరాలను పరిశీలిస్తే ఎవరేంటో అర్థమవుతుందని చెబుతున్నది. ప్రజలు ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నారని స్పష్టమవుతోంది.

- కరీంనగర్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ పెద్దపల్లి (నమస్తే తెలంగాణ)

పెద్దపల్లి పార్లమెంట్ బరిలో ఎలాగైనా తమ జెండా ఎగురవేయాలని ప్రధాన పార్టీలు ఉవ్విళ్లూరుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించాయి. బీఆర్ఎస్ అభ్యర్థిగా కొప్పుల ఈశ్వర్, కాంగ్రెస్ అభ్యర్థిగా గడ్డం వంశీ, బీజేపీ గోమాస శ్రీనివాస్‌ను బరిలోకి దింపాయి. అయితే, అభ్యర్థుల గుణగణాలపై జోరుగా చర్చ సాగుతున్నది. క్షేత్రస్థాయి నుంచి ఎదిగిన నేతగా.. ప్రజల సమస్యలే ఎజెండాగా పోరాడే నాయకుడిగా.. సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న కొప్పులకు ప్రజల్లో మంచి స్పందన వస్తున్నది. కమలం పార్టీ అభ్యర్థి శ్రీనివాస్ పేరు వినిపించడం లేదు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ పరిస్థితి వేరే రకంగా ఉన్నది. ఆయన ప్యారాచూట్ నేతగా ఇక్కడ పోటీ చేస్తున్నారనే చర్చ ప్రస్తుతం నియోజకవర్గ ప్రజల్లో నడుస్తోంది. ఆయన ఎమ్మెల్యే వివేక్ కొడుకుగా ఇప్పుడిప్పుడే ప్రజలకు పరిచయం అవుతున్నారే తప్ప.. ఈ ప్రాంతంతో గానీ, ఈ నేలతో గానీ ఆయనకు పెద్దగా సంబంధాలున్న దాఖలాలు లేవు. అంతేకాదు.. గతంలో గడ్డం వంశీ ఈ ప్రాంతానికి ఏ రూపంలోనూ సేవలు చేసిన దాఖలాలు లేవు. అంటే.. ఇతనే గడ్డం వంశీ అని పేరు చెపితే తప్ప.. ప్రజలు గుర్తించలేని పరిస్థితి అతనిది. పెద్దగా రాజకీయ అనుభవం లేక పోవడంతోపాటుగా ఈ ప్రాంత ప్రజా సమస్యలపై పట్టు లేకపోవడం, ప్రధానంగా సింగరేణి కార్మికుల తీరుతెన్నులపై అవగాహన లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కార్పొరేట్ వ్యాపారాలు చేసుకునే ఆయనకు ప్రజల కష్టాలు ఏం తెలుస్తాయనే ప్రశ్నలు ప్రజల నుంచి ఉత్పన్నమవుతున్నాయి. ఇదే సమయంలో నియోజకవర్గ ప్రజలు కొప్పులతో పోల్చి చూస్తున్నారు. జనం నుంచి ఎదిగిన ఈశ్వర్ ఎక్కడ.. ఊడిపడ్డ వంశీ ఎక్కడ..? అని ప్రశ్నిస్తున్నారు. ఉద్యమనేతగా ఈ మట్టితో.. ప్రజలతో అనుబంధమున్న కొప్పులను గెలిపిస్తే అందుబాటులో ఉంటారని, అదే వంశీకి అవకాశమిస్తే టూరిస్టులాగా వచ్చిపోతారనే చర్చ ప్రజల్లో ప్రస్తుతం జోరుగా నడుస్తోంది. ఈ ఎన్నికలు ఆగర్భ శ్రీమంతుడికి.. భూగర్భ కార్మికుడికి మధ్య జరుగుతున్నాయన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. గడ్డం వివేక్ కుటుంబం కేవలం అధికారం, పదవుల కోసం మాత్రమే రిజర్వేషన్‌ను వాడుకుంటున్నదని, వాళ్లెప్పుడూ ప్రజల కష్టాలను తీర్చలేదని, ఇప్పుడు వాళ్ల కుటుంబం నుంచి మూడో వారసుడిని గెలిపించినా ప్రయోజనమేమీ ఉండదని ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. అదే అజాత శత్రువు, పదవులెన్ని వచ్చినా.. ప్రజల కోసం అంకితమయ్యే కొప్పులను ఆశీర్వదిస్తే సమాజం కోసం పనిచేస్తారన్న చర్చ జరుగుతోంది. గుణవంతుడెవరో.. ధనవంతుడెవరో చూడాలంటే నామినేషన్ల సందర్భంగా సమర్పించిన ఆస్తుల పత్రాలే నిదర్శంగా నిలుస్తున్నాయి.

కొప్పుల @ ₹5.22 కోట్లు

బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, ఆయన భార్య స్నేహలత పేరిట మొత్తం ₹5.22 కోట్ల విలువైన స్థిర, చరాస్తులున్నట్టు నామినేషన్‌లో స్పష్టం చేశారు. ఆయన వద్ద నగదు ₹20 వేలు, ₹90.34 లక్షల చరాస్తులు, ₹40 లక్షల విలువైన స్థిరాస్తి ఉన్నట్టు వెల్లడించారు. కొప్పుల వద్ద 60 గ్రాముల బంగారం (₹3.39 లక్షలు), స్నేహలత దగ్గర 200 గ్రాముల బంగారం(₹11.31 లక్షలు), ₹75,300 విలువైన కిలో వెండి ఉన్నట్లు స్పష్టం చేశారు. కొప్పుల పేరిట ₹3.5 లక్షల విలువైన రెండు ఎల్ఐసీ పాలసీలు, ₹28 లక్షల విలువైన ఇన్నోవా వాహనం, ₹30.26 లక్షల ఇన్నోవా హైక్రాస్ మాడల్ కారు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ వాహనాన్ని 2023 సంవత్సరం ఎన్నికల సమయంలో కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ₹28.75 లక్షల అప్పులున్నట్టు తెలిపారు. ఆయన భార్య స్నేహలత వద్ద నగదు ₹15 వేలు, ₹2.69 కోట్ల విలువైన చరాస్తులు, ₹1.23 కోట్ల స్థిరాస్తులు ₹10.25 లక్షల విలువైన కారు ఉన్నట్లుగా వెల్లడించారు. స్నేహలత పేరిట ₹1.74 కోట్ల అప్పులున్నట్టు చూపారు. తమపై ఎలాంటి సివిల్, క్రిమినల్ కేసులు లేవని స్పష్టం చేశారు.

ఐఎంఎల్ డిపోలో అవినీతి మత్తు

- ఓ ప్రైవేట్ ఉద్యోగి పెత్తనం
- నాలుగు వాహనాలతో సొంతంగా ట్రాన్స్‌పోర్టు
- అనుకూలమైన దుకాణాలకే మద్యం కేటాయింపులు
- వ్యాపారుల ఫిర్యాదుతో వెలుగులోకి ఘటన

కరీంనగర్ ఐఎంఎల్ డిపో అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. దుకాణాలకు మద్యం కేటాయింపులో అవకతవకలకు పాల్పడుతూ ఉద్యోగులు పెద్ద ఎత్తున డబ్బు దండుకుంటున్నట్లు తెలిసింది. డిపో అధికారులకు సంబంధం లేకుండా స్టాక్ క్రయవిక్రయాల పట్టికను నమోదు చేసే కాంట్రాక్టు ఉద్యోగి మద్యం డిపోను నడిపించడం విమర్శలకు తావిస్తున్నది. సాధారణ కంప్యూటర్ ఆపరేటర్‌గా చేరిన సదరు ఉద్యోగి డిపోపై పెత్తనం చెలాయించడమే గాకుండా, ఏకంగా నాలుగు వాహనాలు సొంతంగా కొని ట్రాన్స్‌పోర్ట్ చేస్తుండడం వెనుక అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతున్నది.

– రాంనగర్, ఏప్రిల్ 21

మద్యం దుకాణాల్లో ప్రాంతాలవారీగా అనేక రకాల మద్యం బాటిళ్లు అమ్ముడవుతుంటాయి. వీటిలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో బ్రాండ్ ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. దీనిని దృష్టిలో పెట్టుకొని మద్యం దుకాణదారులు ఆయా బ్రాండ్లను ఎక్కువ సంఖ్యలో దిగుమతి చేసుకుంటారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో బీర్లకు ఫుల్ డిమాండ్ ఉంటుంది. అధిక సంఖ్యలో బీర్లు కొనుగోలు చేస్తారని దుకాణాదారులు కూడా పెద్ద మొత్తంలో స్టాక్ తీసుకునేందుకు డీడీలు తీస్తుంటారు. తమకు అనుకూలంగా అమ్ముడయ్యే మద్యం బ్రాండ్లను ఏ సంఖ్యలో కావాలో దానికి తగిన రేట్లు డీడీ తీసి ప్రభుత్వ ఖాతాకు జమ చేస్తారు. దానికి అనుగుణంగా మద్యం డిపో నుంచి వారికి ఆయా బ్రాండ్లను సరఫరా చేయాల్సి ఉంటుంది.

ఇండెంట్లో స్టాకు వివరాలు

మద్యం డిపోలో ఉన్న స్టాక్, బ్రాండ్ల వివరాలను ప్రత్యేకమైన యాప్‌లో నమోదు చేయడం ద్వారా ఏయే బ్రాండ్ ఎంతవరకు స్టాక్ ఉన్నాయో మద్యం వ్యాపారులు తెలుసుకొని డీడీలు తీసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఈ యాప్‌లో బ్రాండ్ల వారీగా స్టాక్ వివరాలు ఉండడంతో మద్యం దుకాణాదారులు వారి డిమాండ్‌కు తగినట్లు మద్యం దిగుమతి చేసుకునేందుకు డీడీలు తీస్తుంటారు. అయితే, రెండింటిలో వివరాలు చూసి డీడీలు తీసిన వ్యాపారులకు ఒక్కోసారి వారికి అవసరమైన బ్రాండ్లను ఐఎంఎల్ డిపో నుంచి ఇవ్వడం లేదు. దీనికి ప్రధానంగా చెబుతున్న కారణం రేషన్ పద్ధతిలో మద్యం కేటాయిస్తామని, అడిగినంత ఇవ్వలేమని వ్యాపారులకు తేల్చి చెప్తున్నారు. ఇండెంట్‌లో చూసిన తర్వాతే డీడీలు తీశామని, స్టాక్ ఎందుకు ఇవ్వలేరని వ్యాపారులు నిలదీసినా సమాధానం చెప్పేవారు లేరు. డిపోలో ఉన్న మేనేజర్లు కాంట్రాక్టు ఉద్యోగి చెప్పు చేతల్లో నడుస్తూ అవినీతికి పాల్పడుతుండడంతో ఈ పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. సదరు కాంట్రాక్టు ఉద్యోగి కొందరు వైన్స్ యజమానుల దగ్గర మామూళ్లు తీసుకుంటూ వారు అడిగిన మద్యం బ్రాండ్లను పరిమితికి మించి ఇస్తున్నారని, మామూళ్లు ఇవ్వని వారికి రేషన్ పద్ధతిలో కేటాయిస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీనిపై పలువురు వైన్స్ యజమానులు ఇప్పటికే డిపో మేనేజర్లకు ఫిర్యాదు చేసినా కాంట్రాక్టు ఉద్యోగి చెప్పు చేతుల్లో ఉండడంతో వారు స్పందించడం లేదని మద్యం దుకాణదారులు వాపోతున్నారు.

సొంతంగా ట్రాన్స్‌పోర్టు

కాంట్రాక్టు ఉద్యోగిగా చేరి రూ.కోట్లకు పడగలెత్తిన సదరు ఉద్యోగి ఏకంగా సొంతంగా ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం కూడా మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. నాలుగు డీసీఎం వాహనాలను కొనుగోలు చేసి దుకాణాలకు మద్యం రవాణా చేసే కాంట్రాక్టు కుదుర్చుకొని ఈ వ్యవహారం నడిపిస్తున్నట్లు సమాచారం. కరీంనగర్ ఐఎంఎల్ డిపో నుంచి 248 దుకాణాలకు మద్యం రవాణా అవుతుంది. డీడీలు తీసిన దుకాణాదారులకు ట్రాన్స్‌పోర్ట్ చేసేందుకు ముందే ఒప్పందం కుదుర్చుకున్న ఈ కాంట్రాక్టు ఉద్యోగి తనకు ట్రాన్స్‌పోర్ట్ చేసే అవకాశం కల్పించిన దుకాణదారులకు అడిగిన బ్రాండ్లను అడిగినంతగా ఇస్తూ తనకు ట్రాన్స్‌పోర్ట్ ఇవ్వని దుకాణదారులకు రేషన్ పద్ధతిన కేటాయింపులు చేస్తున్నట్లు మద్యం దుకాణాదారులు ఐఎంఎల్ డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. మద్యం స్టాక్ వివరాలను నమోదు చేసేందుకు యాప్‌ను రూపొందించిన ప్రభుత్వం ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ అనుభవం కలిగిన ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిని నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా సీటెల్ అనే కంపెనీ కాంట్రాక్టు దక్కించుకొని డిపోల వారీగా సిబ్బందిని నియమించింది. ఆ కాంట్రాక్టు పద్ధతిలో చేరిన సదరు ఉద్యోగి ఏకంగా మూడు జిల్లాలకు మద్యం రవాణా చేసే ఐఎంఎల్ డిపోను తన చెప్పు చేతల్లో ఉంచుకొని నడిపిస్తున్నా ఎక్సైజ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఇకనైనా సదరు కాంట్రాక్టు ఉద్యోగి అవినీతిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని, రూ.కోట్లు పెట్టి దుకాణాలు దక్కించుకున్నా సరుకు ఇవ్వకపోవడంతో వ్యాపారం జరగడం లేదని మద్యం వ్యాపారులు మొరపెట్టుకుంటున్నారు. ఈ విషయమై ఐఎంఎల్ డిపో మేనేజర్ రవిని సంప్రదించగా, రెండు నెలలుగా రేషన్ పద్ధతిలో మద్యం కేటాయిస్తున్నామని, ఇబ్బందులు ఉంటే ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎలాంటి అవకతవకలు లేవని, మొత్తం 250 మద్యం దుకాణాలకు స్టాక్‌ను బట్టి రేషన్ పద్ధతిలో కేటాయింపులు జరుగుతాయని తెలిపారు.

సందేహాల నివృత్తికి 'చెక్ లిస్ట్'

- సిబ్బంది అనుమానాలను నివృత్తి చేసేందుకు బుక్‌లెట్
- రూపొందించిన ఎలక్షన్ కమిషన్
- కరదీపికలతో పాటు పంపిణీ

బూత్‌ల్లో బారులు తీరిన ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకొనేందుకు ఎంతవరకు సమయం ఇవ్వాలి..? ఏదేని పరిస్థితుల్లో ఈవీఎంలు మొరాయిస్తే ఏంచేయాలి..? ఓటింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే ఏవిధంగా ఈవీఎంలకు ఏవిధంగా సీల్ వేయాలి..? తరచూ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి వచ్చే సందేహాలు.. ఇలాంటి అనుమానాలకు చెక్ పెట్టేందుకు ఎలక్షన్ కమిషన్ వినూత్న విధానానికి రూపకల్పన చేసింది. చెక్‌లిస్ట్ పేరిట ఓ బుక్‌లెట్‌ను రూపొందించింది. వీటిని విధుల్లో పాల్గొనే పీవో, ఏపీవోలకు కరదీపికలతో పాటు అందించేందుకు చర్యలు చేపడుతున్నది.

- కలెక్టరేట్, ఏప్రిల్ 21

ఓటింగ్ సమయంలో ఎలాక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు మొరాయించినా, పోలింగ్ సమయం దాటినా క్యూలైన్లలో అనేక మంది ఓటర్లు బారులు తీరిన సందర్భాల్లో ఏ విధంగా వ్యవహరించాలో తెలియక సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడేది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఎన్నికల సంఘం గందరగోళ పరిస్థితులు తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఎన్నికల విధులు, ఓటర్ల జాబితాల పరిశీలన, ఈవీఎంల తరలింపు ప్రక్రియ తదితర అంశాలతో కూడిన వివరాలతో కరదీపికను రూపొందించింది. ఇప్పుడు ఎన్నికల నిబంధనలు, విధి నిర్వహణపై ప్రత్యేక చెక్‌లిస్ట్‌తో కూడిన బుక్‌లెట్లను తయారు చేసింది. ఇందులో ముఖ్యంగా ప్రిసైడింగ్ అధికారుల విధులు, పోలింగ్‌కేంద్రం వద్ద ఏర్పాట్లు, మాక్ పోలింగ్, ఏజెంట్ల నియామకం, ఈవీఎంల నిర్వహణ, మొరాయించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలింగ్ సమయంలో పాటించాల్సిన సూచనలు, పోలింగ్ ముగింపు, నమోదైన మొత్తం ఓట్లు, బీయూలను సీల్ చేసే విధానం, తదితర అంశాలకు సంబంధించిన సంపూర్ణ సమాచారం నిక్షిప్తంచేశారు. దీంతో విధుల్లో పాల్గొనే సిబ్బంది ఇబ్బందులు తొలగనుండగా, పోలింగ్ ప్రక్రియకు కూడా అంతరాయం లేకుండా సజావుగా జరిగే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

చేయాల్సినవి...చేయకూడనివి..

ఎన్నికల విధుల్లో ఎలాంటి తప్పులు దొర్లకుండా పటిష్టమైన జాగ్రత్తలు తీసుకునే క్రమంలో సిబ్బంది విధుల్లో భాగంగా చేయాల్సినవి, చేయకూడనివి పేరిట హాండ్ బుక్‌లు ముద్రించి శిక్షణ సమయంలో అందజేశారు. ఇప్పటికే మొదటి విడుత శిక్షణ పూర్తి కాగా, మరో రెండు విడుతల్లో వీరికి శిక్షణ ఇవ్వనున్నారు. గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్ల నేపథ్యంలో ఈసారి పోలింగ్, లెక్కింపు సందర్భాల్లో అత్యంత అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి తప్పిదాలకు అస్కారం లేకుండా ఎన్నికల క్రతువు ముగించేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతుండడంపై ఓటర్లు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.